క్లుప్తంగా

ఓజోన్ పరిరక్షణ దినోత్సవం



ప్రతిభచాటిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని మహాత్మా జ్యోతిబా పూలే మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేంసాని వెంకటేశ్వరరావు విద్యార్థులకు ఓజోన్ పొర ప్రాముఖ్యతను వివరించి, దాని రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

క్రీడా కిట్లు అందజేత

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని గౌతమి పాఠశాల విద్యార్థులకు దసరా సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అందించిన క్రీడా కిట్లను కాంగ్రెస్ మండల నాయకుడు గుండా బ్రహ్మం అందజేశారు. క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కిట్లు అందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకన్న, రాంబాబు, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, మల్లయ్య, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని 33/11 కేవీ బుర్హాన్‌పురం సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా మైక్రోవేవ్ ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు, ఎన్ఎస్‌టీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఖమ్మం టౌన్-1 ఏడీఈ నాగార్జున మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో మామిళ్లగూడెం, బుర్హాన్‌పురం, బస్‌డిపోరోడ్, మయూరిసెంటర్, ఎన్ఎస్‌టీ రోడ్, నెహ్రూనగర్, బాలాజీనగర్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

21న నెలనెలా వెన్నెల

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఈ నెల 21(ఆదివారం) నెల నెలా వెన్నెల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అన్నాబత్తుల సుబ్రమణ్యకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ, ఖమ్మం కళాపరిషత్, ప్రజా నాట్య మండలి సంయుక్తంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో పి.వెంకన్నబాబు రచన, డి.వినయ్ దర్శకత్వంలో కాకినాడకు చెందిన ఎస్వీ రంగారావు కళాస్రవంతి కళాబృందం ఆచమనం నాటిక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నివాళి..

కూసుమంచి: మండలంలోని గోపాలరావుపేట గ్రామానికి చెందిన డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్ తల్లి భద్రమ్మ (75) గుండెపోటుతో సోమవారం రాత్రి మృతిచెందారు. ఈమేరకు మంగళవారం ఆమె మృతదేహాన్ని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు కందాల ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీ కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కార్మికవర్గ ఐక్యతే ప్రధాన మార్గమని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఉప ప్రధాన కార్యదర్శి గద్దం లింగమూర్తి పేర్కొన్నారు. మంగళవారం ఉదయం ఖమ్మంలోని సీహెచ్.వీ.రామయ్య స్మారక భవనం వద్ద గుర్రం రామారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆవిర్భావ దినోత్సవంలో రాష్ట్ర నాయకుడు అల్లంశెట్టి వెంకటేశ్వర్లు శ్వేతారుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో లింగమూర్తి మాట్లాడుతూ.. భద్రాచలం డిపోలో కార్మికులు అపూర్వ ఐక్యత కనబరిచి పోరాడి తమ సమస్యలు పరిష్కరించుకున్నారని, భద్రాచలం డిపో కార్మికులు సాధించిన విజయం కార్మికవర్గ ఐక్యతకు విజయం సాధించడానికి నిదర్శనమన్నారు. ఖమ్మం డిపో కార్యదర్శి గుగ్గిళ్ల రోశయ్య, అల్లంశెట్టి వెంకటేశ్వర్లు, తోకలు బాబు, దండా కృష్ణమూర్తి, రంగా రామారావు, పొగాకు వెంకటకృష్ణ, కందికొండ నాగేశ్వరరావు, అల్లంశెట్టి వెంకటేశ్వర్లులతో పాటు మాధవరావు, సుధాకర్, బసవయ్య, సరిత, రామలక్ష్మి, షేక్ బాషా, పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కిష్కిందాపురి
వినోద	కొత్త లోక, డెమాన్‌స్లాయర్
సాయిరాం	డెమాన్‌స్లాయర్, కొత్తలోక
ఆదిత్య	మిరాయ్
శ్రీనివాస	లిటిల్ హార్ట్స్

- ఖమ్మంగాంధీచౌక్



అధ్వానంగా ఉన్న ప్లాట్‌ఫామ్ నంబర్‌వన్

అమృత్.. ఆలస్యం

రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనుల్లో జాప్యం

- రూ.2.40కోట్లతో రెండేళ్ల క్రితం ప్రారంభం
- అదనంగా రూ.25 కోట్లు మంజూరు
- అయినా పూర్తికాని పనులు
- కనీస సౌకర్యాలు లేక ప్రయాణికుల పాట్లు



పూర్తయిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి

ఖమ్మం రాపర్తినగర్: అనునిత్యం వేలాది మంది ప్రయాణికులతో బిజీబిజీగా ఉండే ఖమ్మం రైల్వే స్టేషన్‌లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఆధునికీకణ పేరుతో అమృత్ భారత్ పథకం కింద రెండేళ్ల క్రితం మొదలైన పనులు నత్తనడక సాగుతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తొలిదశ నిధులతో ప్లాట్‌ఫామ్ పనులు పూర్తి కాగా.. మిగిలిన పనులు అలాగే నిలిచిపోయాయి. ఈనేపథ్యాన ప్లాట్‌ఫాం కింద మొత్తం తవ్వడంతో గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. రైలు ఎక్కిదిగే సమయాన అందులో ఎక్కడ పడిపోతామోనని భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. పనులు ఎప్పుడు పూర్తి చేస్తారో అర్థం కాక అధికారులపై మండిపడుతున్నారు.

అదనంగా రూ.25 కోట్లు..

అమృత్ భారత్ పథకంలో భాగంగా ఇప్పటికే ఖమ్మం రైల్వేస్టేషన్‌కు రూ. 25.40 కోట్లు రాగా అదనంగా మరో రూ.25 కోట్లు వచ్చినట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. అయినా పనులు త్వరితగతిన పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతీ రోజు రైళ్లల్లో ప్రయాణించే ప్రయాణికులు రైలు వచ్చే సమయానికి ముందే రావడంతో స్టేషన్‌లో ఎక్కడ కూర్చోవాలో అర్థం కాని పరిస్థితి ఉందని, ఈ అవస్థలు ఇంకెన్ని రోజులు పడాలోనని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకటో నంబర్, రెండో నంబర్ ప్లాట్‌ఫామ్‌లను త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రయాణికుల అవస్థలు..

రెండు ప్లాట్‌ఫామ్‌లను అనుసంధానం చేస్తూ నిర్మిస్తున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తయినా.. ఎక్సలేటర్, లిఫ్ట్ పనులు పూర్తికాకపోవడం పట్ల ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక ఖమ్మం రైల్వే స్టేషన్ ముఖద్వారం పనులు ఇంతవరకు ప్రారంభించలేదు. దీంతో ప్రయాణికులు ఎప్పుడు పూర్తవుతాయని ప్రయాణికులు నిరీక్షిస్తున్నారు. కాగా, ఇప్పటికే ప్రయాణికుల కోసం వెయిటింగ్ హాల్ ఒకటి పూర్తకాగా మరొకటి పూర్తి కావాల్సి ఉంది. స్టేషన్ మాస్టర్ క్యాబిన్, ఇతర ఆఫీసు కార్యాలయాలు ఇంకా నిర్మిస్తున్నారు. పనులు జరుగుతున్న తీరుపై సంబంధిత బాధ్యుల ద్వారా తెలుసుకుందామంటే అందుబాటులోకి రావడం లేదు. ఆధునికీకరణ పనులు ఏమో కాని ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. రైల్వే శాఖ ఇప్పటికైనా పనులను వెంటనే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



అసంపూర్తిగా ఎక్సలేటర్

రాత్రి వేళల్లో మరీ ఇబ్బంది



ప్రతీ రోజు బోనకల్ నుంచి ఖమ్మానికి వస్తా. ప్లాట్‌ఫామ్ కింద మొత్తం గుంతలే ఉన్నాయి. రాత్రి వేళల్లో మాత్రం వాటిని చూడకుండా నడిస్తే కిందపడాల్సిందే. పనులను త్వరగా పూర్తి చేసి గతంలో మాదిరిగా అందుబాటులోకి తీసుకురావాలి. ఇప్పటికైనా సంబంధిత అధికారుల స్పందించి ప్రయాణికుల బాధలు తీర్చాలి.

– నాగేశ్వరరావు, బోనకల్

వేగవంతం చేయాలి



ఆధునికీకరణ పనుల్లో అలసత్వం ప్రదర్శించకుండా త్వరగా పూర్తి చేయాలి. రెండేళ్లుగా పనులు జరుగుతున్నా ఇంత వరకు పూర్తి కాలేదు. సందరీకరణ పేరుతో ప్రయాణికులను ఇబ్బంది పెట్టొద్దు. రైల్వే స్టేషన్ ముందు భాగంలో పనులు ఇంక మొదలుపెట్టనే లేదు. త్వరగా పూర్తిచేసి సుందరంగా తీర్చిదిద్దాలి.

– దామళ్ల సూర్య, ఖమ్మం

రాజ్యాంగ పరిరక్షణ కోసమే మహాసభలు

ఖమ్మంమయూరిసెంటర్: భారత రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయమే లక్ష్యంగా సీపీఐ 25వ మహాసభలు జరగనున్నాయని ఆ పార్టీ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. ఈనెల 21 నుంచి 25 వరకు పంజాబ్‌లోని చండీఘర్‌లో నిర్వహించే ఈ మహాసభల్లో దేశంలోని ప్రధాన సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోనున్నట్లు తెలిపారు. మంగళవారం గిరిప్రసాద్ భవన్‌లో మేకల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'పోరాడుదాం... ప్రజలు గెలుస్తారు.. సత్యం , న్యాయం జయిస్తుంది'అనే నినాదంతో ఈ మహాసభలు జరగనున్నాయన్నాయని, గాజాపై ఇజ్రాయిల్ దాడి ఇతరత్రా విదేశీ సమస్యలపై ప్రత్యేక సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, పోటు కళావతి, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హేమంతరావు

కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘ ప్రతినిధులు

ఖమ్మం సహకారనగర్: 2010వ సంవత్సరానికి ముందు ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులకు టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) నుంచి మినహాయింపునివ్వాలని తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గండ్ర వెంకటరమణారెడ్డి, పలివెల అంజనికృష్ణల ఆధ్వర్యాన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి విన్నవించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి వినతిపత్రం పంపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

ఖమ్మంగాంధీచౌక్: పర్యావరణ మిత్ర జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ కడవెండి వేణుగోపాల్ జన్మదినం సందర్భంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో శ్రీ సత్యసాయి బాబా సంస్థ సహకారంతో అన్నదానం చేశారు. తొలుత 59వ డివిజన్‌లో మొక్కలు నాటి ఆలయాల్లో పూజలు చేశారు. కార్యక్రమంలో వేణుగోపాల్ సతీమణి అరుణకుమారి, కడవెండి శ్రీనివాస్, విశ్వనాథ్‌గుప్త, రాధారాణి, శిరం కృష్ణ ప్రసాద్, కేశవపట్నం శ్రీనివాసరావు, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

వీర తెలంగాణ పోరాట సభను జయప్రదం చేయండి

తిరుమలాయపాలెం: ఖమ్మంలో నిర్వహించే వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి శ్రీను కోరారు. బుధవారం ఈమేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈసభకు పార్టీ జాతీయ కార్యదర్శి ఎంఏ బేబీ, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని, ర్యాలీలో పాల్గొనే ప్రతిఒక్కరూ ఎర్ర చొక్కాలు, ఎర్ర చీరలు ధరించి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుళ్లూరు నాగేశ్వరావు, కోడి లింగయ్య, బింగి రమేష్, తంగేళ్ల రమేష్, రాజశేఖర్, బండారి సైదులు, దొండేటి నిర్మల్‌రావు, దొడ్డ లింగస్వామి, వెంకటేష్, దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి కృతజ్ఞత సభ

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వం చొరవతో 317జీఓ బాధితులకు ఉపశమనం కల్గిస్తుందని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు అన్నారు. మంగళవారం నగరంలోని ప్రజాప్రభుత్వానికి కృతజ్ఞత సభ నిర్వహించగా.. ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులు తమ హక్కులు, గౌరవం, భద్రతతో పని చేసే వాతావరణాన్ని కల్పించడం ప్రభుత్వ కర్తవ్యమన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గండు యాదగిరి, మన్సూర్, నాయకులు రాధాకృష్ణ, పాశం శ్రీనివాసరావు, కరీముల్లా, సుధాకర్ రెడ్డి, వెంకన్న, అంబటి రవికుమార్, రాజు, దుంపటి రవి తదితరులు పాల్గొన్నారు.

పోషణతో కూడిన విద్యనందించాలి

కామేపల్లి/నేలకొండపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు పోషణతో కూడిన విద్యనందించాలని ఐసీడీఎస్ సీడీపీఓ దయామణి, ఏసీడీపీఓ జె.రత్నకుమారి సూచించారు. మంగళవారం కామేపల్లి రైతువేదికలో దయామణి, నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురం రైతు వేదికలో కూసుమంచి, నేలకొండపల్లి మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లకు మూడు రోజుల పాటు శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన సందర్భంగా రత్నకుమారి మాట్లాడారు. పిల్లలు సెల్‌ఫోన్లకు బానిసలు కాకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, ఇందులో తల్లిదండ్రులను భాగస్వాములను చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కె.రమాదేవి, వై.సువర్చల, పి.నాగమణి, కె.పార్వతి, లలితమ్మ, కృష్ణకుమారి, లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



నేలకొండపల్లిలో మాట్లాడుతున్న ఏసీడీపీఓ

నియామకాలు..

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా రత్నం



నియామకపత్రం అందుకుంటున్న రత్నం

నేలకొండపల్లి: భైరవునిపల్లి అడ్డా ఆటో యూనియన్ అధ్యక్షుడిగా మాతంగి రత్నం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన ఆటో యూనియన్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా అలవాల నరసింహారావు, కార్యదర్శిగా పోలంపల్లి గోపి, ప్రధాన కార్యదర్శిగా మాతంగి రాజేందర్, కోశాధికారిగా దున్న ప్రసాద్, గౌరవ సలహాదారుడు గోపి ఉపేందర్ రావులు నియమితులయ్యారు. ఆటో యూనియన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కమిటీ పేర్కొంది.

జేయూహెచ్ జిల్లా అధ్యక్షుడిగా సయ్యద్ అహ్మద్ ఖాస్మి

ఖమ్మం మామిళ్లగూడెం: జమీయత్ ఉలేమా ఏ హింద్ (జేయూహెచ్) ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా మౌలానా మహమ్మద్ సయ్యద్ అహ్మద్ ఖాస్మి మంగళవారం ఐదోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఖమ్మం అజీజ్ మిల్లత్ మసీదులో ఎన్నిక జరగగా.. ఉపాధ్యక్షులుగా మౌలానా షేక్. ముజాహిద్ ఇషాతి, ముఫ్తీ ఉమర్ ఫారూఖ్, ముఫ్తీ ఇమ్రాన్ ఖాన్ ఖాస్మి, ముఫ్తీ అబ్దుల్ రౌఫుఖాన్ ఖాస్మి, మౌలానా ఆరిఫ్, కార్యదర్శిగా హాఫిజ్ ఫజ్లుల్లా, కోశాధికారిగా మౌలానా సాబీర్ ఖాస్మిలు ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకుడిగా రాష్ట్ర నాయకులు మౌలానా అబ్దుల్ సత్తార్ ఖాస్మి ,వ్యవహరించగా ముఫ్తీ జలాలుద్దీన్ పర్యవేక్షించారు.

కృష్ణయ్య పోరాటంతోనే ఫీజు బకాయిల విడుదల



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలతో జరిగిన చర్చలతోనే ప్రభుత్వం వారం రోజుల్లో ఫీజు బకాయిలు రూ.600 కోట్లు విడదల చేస్తానని హామీ ఇవ్వడం ఆర్.కృష్ణయ్య పోరాట ఫలితమేనని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కోసం ఆయన చేసిన పోరాటాలు ఫలించాయన్నారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూడేపల్లి కృష్ణమాచారి మాట్లాడగా.. సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగనబోయిన పుల్లారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మసనం శివరామకృష్ణ, ఖమ్మంటౌన్ అధ్యక్షులు వెంకటరామయ్య, వెంకటాచారి, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఆరా

ఖమ్మంమయూరిసెంటర్: శానిటేషన్ విజిట్‌లో భాగంగా మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య కేఎంసీ పరిధిలోని 36, 46, 48, 55వ డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా వర్కర్లు ఎంతమంది హాజరయ్యారో పరిశీలించి వారు ఎక్కడెక్కడ పనిచేస్తున్నారో తనిఖీ చేశారు. జటాయు వాహనం పని చేసిన వివరాలు తెలుసుకున్నారు. ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్‌తో మాట్లాడి ప్రతిరోజు స్వీపింగ్ మిషన్‌తో మెయిన్ రోడ్లు పూర్తిగా శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా డివిజన్లలో డివైడర్ మెయింటెనెన్స్ పరిశీలించారు.

కమిషనర్‌ను కలిసిన మున్సిపల్ ఎంప్లాయీస్ ఫోరం కమిటీ

టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి కొనిదెన శ్రీనివాస్ నేతృత్వాన మంగళవారం నూతనంగా ఏర్పడిన జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ ఫోరం అధ్యక్షుడు జి.సుధాకర్, కార్యదర్శి జి.శ్రీనివాసరావుతో పాటు కమిటీ సభ్యులు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా నాయకులు తాళ్లూరి శ్రీకాంత్, హరికృష్ణ కోనార్, బుర్రి వెంకటేశ్వర్లు, మున్సిపల్ ఫోరం సభ్యులు పాల్గొన్నారు.



కార్మికుల హాజరును పరిశీలిస్తున్న కమిషనర్ అగస్త్య

కేఎంసీ సమాచారం..

వార్డు ఆఫీసర్లతో సమావేశం..

కేఎంసీ కార్యాలయంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్.. ఆర్ఓ, శానిటరీ సూపర్‌వైజర్‌తో కలిసి వార్డు ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ప్రతీ వార్డు ఆఫీసర్ తమకు కేటాయించిన డివిజన్లలో ట్రేడ్ లైసెన్స్ వసూలు ప్రక్రియను సక్రమంగా చేయాలని సూచించారు.

టెంట్‌హౌజ్ యజమానికి జరిమానా..

కేఎంసీ పరిధిలోని 32వ డివిజన్‌లో రోడ్డుమీద చెత్త వేసిన జ్యోతి టెంట్‌హౌజ్ యజమాని ఎస్.రవికుమార్‌కు మున్సిపల్ అధికారులు రూ.5వేల జరిమానా విధించారు.

విధుల్లో చేరిన గ్రామ పరిపాలనాధికారులు

- క్లస్టర్ల వారీగా అర్బన్‌లో 14, రఘునాథపాలెంలో 11 మంది నియామకం

ఖమ్మం అర్బన్/రఘునాథపాలెం: ప్రభుత్వం తాజాగా నియమించిన గ్రామ పరిపాలనాధికారులు (జీపీఓలు) మంగళవారం విధుల్లో చేరారు. గ్రామాల వారీగా సుమారు ప్రతీ 4,500 ఎకరాలకు ఒక క్లస్టర్‌గా విభజించగా.. ఖమ్మం అర్బన్ పరిధిలో 14 క్లస్టర్లు, రఘునాథపాలెం మండలంలో 11 క్లస్టర్లుగా విభజించి ఒక్కో క్లస్టర్‌కు ఒక జీపీఓను ప్రభుత్వం నియమించింది. భూములకు సంబంధించిన రికార్డులు, జమాబందీ, పహాణీలు, భూ భారతి ఆన్‌లైన్ అప్డేట్‌లు తదితర సేవలు ఇకపై ఆయా గ్రామ పరిపాలనాధికారుల పర్యవేక్షణలో కొనసాగనున్నాయి. కాగా, అర్బన్ జీపీఓలు తహసీల్దార్ సైదులును, రఘునాథపాలెం జీపీఓలు తహసీల్దార్ శ్వేతను మర్యాద పూర్వకంగా కలిశారు. అయితే వీరి నియామకంతో తహసీల్దార్లు, ఆర్‌ఐలకు పనిభారం తగ్గనుంది.

కామేపల్లిలో..

కామేపల్లి: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలకు 10 మంది గ్రామపాలన అధికారులు మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించినట్లు తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. శ్రీవాణి(ముచ్చర్ల), బోలేషా(పాన్నేకల్), విద్యాసాగర్(ఊట్కూర్), వెంకన్న(జాస్తిపల్లి), లాలయ్య(మద్దులపల్లి), అనిల్ (కామేపల్లి), కోటేశ్వరరావు(పింజరమడుగు), గిరీషా(గోవింద్రాల), కందయ్య(కొమ్మినేపల్లి), సుజాత(లింగాల) బాధ్యతలు తీసుకున్నట్లు తెలిపారు.

డైలీ వేజ్ వర్కర్ల సమస్యలపై ఆందోళన

తిరుమలాయపాలెం: తిరుమలయపాలెంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో బాలుర, బాలికల వసతి గృహాల్లో గత ఐదు నుంచి పదేళ్లుగా పనిచేస్తున్న డైలీ వేజ్ కాంటిజెంట్ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం గిరిజన ప్రభుత్వ సమీకృత పాఠశాల వసతి గృహం ఎదుట వర్కర్లు ఆందోళన నిర్వహించారు. గత ప్రభుత్వంలో రూ.16 వేల వేతనాలు వచ్చాయని, ప్రస్తుతం రూ.11 వేలు మాత్రమే ఇస్తుండడం సరికాదన్నారు. ఐదేళ్లుగా నిరవధిక సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రూ. 25వేల వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ ధర్నాకు సీపీఎం నాయకులు సంఘీభావం తెలపగా.. కార్యక్రమంలో డైలివేజ్ కాంటినిజెంట్ వర్కర్లు, యూనియన్ నాయకులు జి.కమల, అరుణ, తేజావత్ పద్మ, తేజావత్ రాజు, బండారి అజిత, బాదావత్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న డైలీ వేజ్ వర్కర్లు

కళాశాలల్లో అధ్యాపకుల కొరత తీర్చాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో అధ్యాపకుల కొరత వేధిస్తుందని, కనీసం అతిథి అధ్యాపకులను అయినా కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చింతల రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా కమిటీల ఆధ్వర్యాన జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యంగా ఖమ్మంలో ఉన్న బాలికల, శాంతినగర్, నయాబజార్, సత్తుపల్లి గర్ల్స్, కారేపల్లి, నేలకొండపల్లి, తదితర జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉందని, వారి సమస్యలపై సంతకాల సేకరణ చేసి తమ దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. వినతి అందించిన వారిలో తిప్పర్తి వినోద్‌రెడ్డి, పోగుల త్రినాథ్, చిన్నపోగు లోకేష్, డీవైఎఫ్ఐ ఖమ్మం డివిజన్ కార్యదర్శి రావులపాటి నాగరాజు, డివిజన్ ఉపాధ్యకుడు కొర్లపాటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



డీఐఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఖమ్మంఅర్బన్: నగరంలోని 3, 4వ డివిజన్ల పరిధిలో మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను 12 మంది లబ్ధిదారులకు మంగళవారం కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లు, మలీదు మనీష్, అర్బన్ తహసీల్దార్ కార్యాలయ రికార్డు అసిస్టెంట్ ఉపేందర్ ఇంటింటికీ తిరిగి చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలువ నరసింహారావు, గోపి, శీలం శ్రీను, చింతల శ్రీను, గోపి, వరగాని రమేష్, మేడబోయిన మల్లేష్, తిప్పెట్ల రాంబాబు, ఎస్‌కె.ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెక్కు..

రఘునాథపాలెం: మండలంలోని కోర్రతండా గ్రామానికి చెందిన లకావత్ పద్మ ఇటీవల ప్రమాదవశాత్తు విద్యాదాఘాతానికి గురై మృతి చెందారు. ఈమేరకు విద్యుత్‌శాఖ ద్వారా మృతురాలికి మంజూరైన రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును మంగళవారం ఆ శాఖ ఏడీఈ సంజీవ్‌కుమార్ తన కార్యాలయంలో మృతురాలి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మంచుకొండ ఏఈ సతీష్, చిన్నయ్య, నాయక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంమామిళ్లగూడెం: డ్రగ్స్, గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలను నియంత్రించాలని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వీ.రాకేష్, పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.శిరోమణి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు టి.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈమేరకు పీవైఎల్, పీఓడబ్ల్యూ, పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి డీఆర్ఓ పద్మకు వినతిపత్రం అందజేశారు. మత్తుపదార్థాల నియంత్రణకు ప్రభుత్వాలు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ, పీవైఎల్ సంస్థల జిల్లా అధ్యక్షులు గోకినపల్లి లలిత, జాటోత్ ప్రేమ్‌సింగ్, ఉపాధ్యక్షులు టి.ఝాన్సీ, సహాయ కార్యదర్శులు జిక్కుల భరత్, ప్రతాప్, శోభ, పీడీఎస్‌యూ నేతలు అశోక్, గోకినపల్లి సరోజిని, వెంకటేష్, మక్కా రవీందర్, ఇస్లావత్ స్వాతి, ఇస్లావత్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వినతి..

ఖమ్మం మామిళ్లగూడెం: భగత్ సింగ్ స్ఫూర్తితో డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుదామని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఈగల్, నార్కోటిక్, ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్, ఎలైట్ యాక్షన్ గ్రూప్, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ అధికారులను సస్పెండ్ చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నానబాల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఖమ్మం జిల్లా ప్రాహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం అధికారికి వినతి పత్రం అందజేశారు. ఫార్మా, కెమికల్ పరిశ్రమల పేరిట డ్రగ్స్ దందాకు పాల్పడుతున్న దుర్మార్గులను కఠినంగా శిక్షించాలన్నారు.